# ‘ప్రజా ఆశీర్వాద సభ’ను విజయవంతం చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న జడ్పీటీసీ డాక్టర్ శ్రీరాం శ్యాం

- మండలంలో నేడు బీఆర్ఎస్ అభ్యర్థి కౌశిక్‌రెడ్డి ప్రచారం
- అధిక సంఖ్యలో ప్రజలు పాల్గొనాలి.. అభ్యర్థిని ఆశీర్వదించాలి
- విలేకరుల సమావేశంలో జడ్పీటీసీ డాక్టర్ శ్రీరాం శ్యాం

జమ్మికుంట, నవంబర్ 1: మండలంలోని జగ్గయ్యపల్లి, పెద్దంపల్లి, మాచినపల్లి గ్రామాల్లో గురువారం జరిగే ‘ప్రజా ఆశీర్వాద సభ’ను విజయవంతం చేయాలని జడ్పీటీసీ డాక్టర్ శ్రీరాం శ్యాం, కేడీసీసీబీ వైస్ చైర్మన్ పింగిళి రమేశ్ ప్రజలకు పిలుపునిచ్చారు. సభకు బీఆర్ఎస్ హుజూరాబాద్ నియోజకవర్గ అభ్యర్థి, మండలి విప్ పాడి కౌశిక్‌రెడ్డి హాజరవుతున్నారని, ప్రజలు పెద్ద సంఖ్యలో తరలివచ్చి ఆయనను ఆశీర్వదించాలని విజ్ఞప్తి చేశారు. బుధవారం జమ్మికుంట పట్టణంలోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రజా ఆశీర్వాద సభ, ప్రచారానికి నియోజకవర్గ ఇన్‌చార్జి ఇనుగాల పెద్దిరెడ్డి, తదితరులు హాజరవుతారని తెలిపారు. సీఎం కేసీఆర్ దేశంలో ఎక్కడాలేని విధంగా సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టారని తెలిపారు. ప్రజల మద్దతు బీఆర్ఎస్ అభ్యర్థికే ఉందని, భారీ మెజార్టీతో ప్రజలు గెలిపిస్తారని పేర్కొన్నారు. రాష్ట్రంలో మూడోసారి కేసీఆర్ సీఎం కావడం ఖాయమని, ఇక్కడ పాడి కౌశిక్‌రెడ్డిని గెలిపించుకుంటేనే అభివృద్ధి సాధ్యమన్నారు. హుజూరాబాద్‌లో గులాబీ జెండా ఎగరేసి, రూ.వెయ్యి కోట్లతో అభివృద్ధి చేసుకుందామని కోరారు. సంక్షేమం, అభివృద్ధి కోసం అన్ని వర్గాలు సహకరించాలని విజ్ఞప్తి చేశారు. కాంగ్రెస్, బీజేపీలు ప్రజా వ్యతిరేక పార్టీలని, ఆ పార్టీలను నమ్మితే మోసపోతామన్నారు. సమావేశంలో శంభునిపల్లి సర్పంచ్ వెంకట్‌రెడ్డి, నాయకులు బల్మూరి సమ్మారావు, రాజారాం, భద్రయ్య, రామస్వామి, సదయ్య, తదితరులున్నారు.

# ప్రగతి ‘బాట’

- స్వరాష్ట్రంలో హుజూరాబాద్-జమ్మికుంట రహదారికి మహర్దశ



హుజూరాబాద్-జమ్మికుంట నాలుగు వరసల రహదారి

హుజూరాబాద్, నవంబర్ 1: హుజూరాబాద్-జమ్మికుంట రహదారికి ప్రత్యేక రాష్ట్రంలో మహర్దశ వచ్చింది. గతంలో పేరుకు రెండు వరసల రహదారిగా ఉన్నా సింగిల్ రోడ్డు కన్నా అధ్వానంగా ఉండేది. ప్రత్యేక రాష్ట్రంలో ఏకంగా నాలుగు వరసల రహదారిగా మార్చుతూ బీఆర్ఎస్ సర్కారు నిర్ణయం తీసుకున్నది. రూ.43కోట్ల నిధులు వెచ్చించి చూడముచ్చటగా రహదారిని వేయడంతో రాకపోకలు సాఫీగా సాగుతున్నాయి. గతంలో 14కిలో మీటర్ల దూర ప్రయాణానికి అరగంట పైగానే సమయం పట్టగా, ప్రస్తుతం 15నిమిషాల కన్నా తక్కువ సమయంలోనే గమ్యస్థానాన్ని చేరుకునే అవకాశం ఉండడం విశేషం.

### నేషనల్ హైవేలా ఉంది



హుజూరాబాద్-జమ్మికుంట రహదారిపై ప్రయాణమంటే ఒకప్పుడు దుఃఖం వచ్చేది. ఇప్పుడు ఈ మార్గం నేషనల్ హైవేను తలపిస్తున్నది. ప్రత్యేక రాష్ట్రంలో రోడ్లు అభివృద్ధి చేయడంతో రవాణా సౌకర్యం మెరుగుపడింది. దీంతో రాష్ట్రం సైతం వేగంగా అభివృద్ధి చెందుతున్నది.

*- కాశిరెడ్డి చిరంజీవి రెడ్డి, తుమ్మనపల్లి*

### బీఆర్ఎస్ అంటేనే అభివృద్ధి



బీఆర్ఎస్ అంటేనే అభివృద్ధి. దేశానికే తెలంగాణను కేసీఆర్ మోడల్‌గా తీర్చిదిద్దారు. జమ్మికుంటకు వెళ్లాలంటే గతంలో అరగంట పైగానే సమయం పట్టేది. ప్రస్తుతం 15నిమిషాల కన్నా తక్కువ సమయంలోనే చేరుకుంటున్నం. బండి గేరు మార్చకుంట కుంట, బ్రేకు వేయకుండా ప్రయాణం సాగుతుంది.

*- పుట్టపాక శ్రీకాంత్, ఇప్పలనర్సింగాపూర్*

# ఒక్క అవకాశం ఇవ్వండి

- బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి కౌశిక్‌రెడ్డి తరపున సతీమణి శాలిని ప్రచారం



పట్టణంలో ఓటు అభ్యర్థిస్తున్న బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి కౌశిక్‌రెడ్డి సతీమణి శాలిని

హుజూరాబాద్‌టౌన్, నవంబర్ 1: పట్టణంలోని సూపర్‌బజార్‌రోడ్‌లో బుధవారం బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి, ఎమ్మెల్సీ పాడి కౌశిక్‌రెడ్డి తరపున ఆయన సతీమణి శాలిని విస్తృతంగా ప్రచారం చేశారు. బీఆర్ఎస్ మ్యానిఫెస్టో కరపత్రాలను పంచుతూ ప్రజలను ఓటు అభ్యర్థించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, తెలంగాణ రాష్ట్రం ఏర్పడ్డప్పటి నుంచి ఇప్పటి వరకు బీఆర్ఎస్ ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలు అమలుచేస్తున్నదని గుర్తు చేశారు. హుజురాబాద్ నియోజకవర్గం సమగ్ర అభివృద్ధి కోసం తన భర్త కౌశిక్‌రెడ్డి నిరంతరం పాటుపడుతున్నారని, ఆయనకు ఒక్క అవకాశం ఇవ్వాలంటూ ప్రజలను కోరారు. దీంతో అక్కడి ప్రజలంతా ఆమెకు మద్దతు పలుకుతూ తప్పక ఓటేస్తామని చేతిలో చెయ్యి వేసి, నుదుట బొట్టు నెట్టి హామీ ఇచ్చారు. ప్రచారంలో ఆమె వెంట పురపాలక సంఘం చైర్‌పర్సన్ గందె రాధిక, వైస్ చైర్‌పర్సన్ కొలిపాక నిర్మల, స్థానిక కౌన్సిలర్ కేసిరెడ్డి లావణ్య, బీఆర్ఎస్ పట్టణాధ్యక్షుడు కొలిపాక శ్రీనివాస్, పట్టణ అధ్యక్షురాలు, కౌన్సిలర్ కల్లెపల్లి రమాదేవి, సోషల్‌మీడియా రాష్ట్ర నాయకురాలు గొడిశాల పావని, కౌన్సిలర్లు, సీనియర్ నాయకులు, కార్యకర్తలు, మహిళలు, యువకులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## ‘ప్రభాకర్‌రెడ్డిపై దాడి చేసిన వారిని శిక్షించాలి’

వీణవంక, నవంబర్ 1: మెదక్ ఎంపీ కొత్త ప్రభాకర్‌రెడ్డిపై దాడి చేసిన నిందితులను కఠినంగా శిక్షించాలని ఎంపీపీ ముసిపట్ల రేణుక-తిరుపతిరెడ్డి, జడ్పీటీసీ మాడ వనమాల-సాధవరెడ్డి, సింగిల్‌విండో చైర్మన్ విజయభాస్కర్‌రెడ్డి, సర్పంచుల ఫోరం అధ్యక్షుడు రఘుపాల్‌రెడ్డి, జమ్మికుంట మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ వాల బాలకిషన్‌రావు, సింగిల్‌విండో మాజీ చైర్మన్ గంగాడి తిరుపతిరెడ్డి ప్రకటనలో కోరారు. ప్రభాకర్‌రెడ్డిపై దాడి హేయమైన చర్య అని, ఓటమి భయంతోనే కాంగ్రెస్ నాయకులు దాడికి పాల్పడ్డారని తెలిపారు. పచ్చని తెలంగాణలో నెత్తుటి రాజకీయాలకు కాంగ్రెస్ పార్టీ పూనుకొందని, దోషులను చట్ట ప్రకారం కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. ఎంపీ ప్రభాకర్‌రెడ్డి త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు.

## ఎన్నికల కోడ్ ఉల్లంఘించిన వారిపై కేసు

హుజూరాబాద్‌టౌన్, నవంబర్ 1: పట్టణంలో ఎన్నికల కోడ్ ఉల్లంఘించి మంగళవారం రాత్రి స్థానిక అంబేద్కర్ చౌరస్తా వద్ద పటాకులు కాల్చిన టీడీపీకి చెందిన పలువురు నాయకులపై కేసు నమోదు చేసినట్లు ఏసీపీ లక్కిరెడ్డి జీవన్‌రెడ్డి బుధవారం తెలిపారు. మోడల్ కోడ్ ఉల్లంఘించిన టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి అయిత హరీశ్, పట్టణాధ్యక్షుడు రామగిరి అంకూస్, నాయకులు ఆడెపు రవీందర్, ఎం లింగారావు, ఎస్‌కే ఫయాజ్‌తో పాటు పలువురిపై కేసు నమోదు చేసి విచారణ జరుపుతున్నట్లు ఆయన చెప్పారు.

## జీఎస్టీ లైసెన్స్ తప్పనిసరిగా తీసుకోవాలి

హుజూరాబాద్‌టౌన్, నవంబర్ 1: దీపావళి పండుగ సందర్భంగా పటాకుల దుకాణాలు పెట్టుకునేవారు తప్పనిసరిగా షాప్ పేరు మీద జీఎస్టీ లైసెన్స్ తీసుకోవాలని డిప్యూటీ గూడ్స్ అండ్ సర్వీస్ ట్యాక్స్ అధికారి మహ్మద్ ముజాహిద్ హుస్సేన్ తెలిపారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ, ఎక్కడ నుంచి అయినా పటాకులు కొనుగోలు చేసుకొని వచ్చేటప్పుడు జీఎస్టీ లైసెన్స్ ఉన్న వేబిల్‌తో పాటు ఆ దుకాణాదారుడి బిల్లు కూడా తప్పనిసరిగా రవాణా చేసే వాహన డ్రైవర్ వద్ద ఉండాలని తెలిపారు. తనిఖీ చేసే అధికారులకు బిల్లు చూపి సహకరించాలని కోరారు. జీఎస్టీ లైసెన్సు వేబిల్ కానీ జీఎస్టీ లైసెన్స్ లెటర్ ప్యాడ్ బిల్లు కానీ లేనట్లయితే ఆ సరుకులకు సంబంధించిన విలువతోపాటు దానిపై ట్యాక్స్‌తో పాటు పెనాల్టీ వసూలు చేయనున్నట్లు తెలిపారు.

# బీఆర్ఎస్ భారీ మెజార్టీతో గెలవాలని ప్రత్యేక పూజలు



హుజూరాబాద్ హనుమాన్ టెంపుల్‌లో పూజలు చేస్తున్న ఆలయ అభివృద్ధి కమిటీ చైర్మన్ భూసారపు బాపురావు, సభ్యులు

హుజూరాబాద్‌టౌన్, నవంబర్ 1: బీఆర్ఎస్ హుజూరాబాద్ ఎమ్మెల్యే అభ్యర్థి, మండలి విప్ పాడి కౌశిక్‌రెడ్డి ప్రచారం సజావుగా సాగాలని, ఎన్నికల్లో భారీ మెజార్టీతో గెలవాలని పట్టణంలోని శ్రీ హనుమాన్ టెంపుల్‌లో ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు బుధవారం ప్రత్యేక పూజలు చేశారు. హుజూరాబాద్ హనుమాన్ టెంపుల్ డైరెక్టర్ పంజార్ మురళిగౌడ్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఆలయ అభివృద్ధి కమిటీ చైర్మన్ భూసారపు బాపురావు, సభ్యులు పంజాల మురళి, సంపంగి రాజేందర్, గంగిశెట్టి వీరన్న, వేముల రాజేశం, రామగిరి మురళి, ప్రతాప శ్రీనివాస్, యాంసాని శ్రీనివాస్, తనుకు రవీందర్, కెక్కర్ల సారయ్య, శనిగరపు పరమేశ్, మాసాడి నర్సయ్య తదితరులు పాల్గొన్నారు.

# కొనుగోలు కేంద్రాలను వినియోగించుకోవాలి



మల్యాలలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న పీఏసీఎస్ చైర్మన్ ఉప్పల తిరుపతిరెడ్డి

ఇల్లందకుంట, నవంబర్ 1: గ్రామాల్లో ఏర్పాటు చేస్తున్న ధాన్యం కొనుగోలు కేంద్రాలను రైతులు వినియోగించుకోవాలని మల్యాల పీఏసీఎస్ చైర్మన్ ఉప్పుల తిరుపతిరెడ్డి సూచించారు. మల్యాలలో పీఏసీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రైతులు దళారులను నమ్మి నష్టపోవద్దని, కేంద్రాల్లో విక్రయించి మద్దతు ధర పొందాలని సూచించారు. ప్రభుత్వం ధాన్యం ఏగ్రేడ్‌కు రూ.2203, బీ గ్రేడ్‌కు రూ.2183 చొప్పున చెల్లిస్తున్నదని చెప్పారు. ధాన్యాన్ని ఇంటివద్దనే ఆరబెట్టి, తాలు, మట్టి లేకుండా శుభ్రం చేసుకోని తీసుకురావాలన్నారు. ఇక్కడ పీఏసీఎస్ వైస్ చైర్మన్ ఉడుత వీరస్వామి, సీఈవో దేవేందర్, డైరెక్టర్లు, రైతులు ఉన్నారు.

# అక్రమంగా తరలిస్తున్న మద్యం పట్టివేత

జమ్మికుంట, నవంబర్ 1: ఎక్సైజ్ సర్కిల్ సీఐ ఎండీ అక్బర్ హుస్సేన్ ఆధ్వర్యంలో సిబ్బంది బుధవారం మున్సిపల్ పరిధిలోని కొత్తపల్లి వద్ద వాహనాల తనిఖీలు నిర్వహించగా, హనుమకొండ జిల్లా కమలాపూర్ మండలం మర్రిపల్లి గూడెంకు చెందిన యుగంధర్ అనే వ్యక్తిని అక్రమంగా మద్యం తరలిస్తూ పట్టుబడ్డాడు. పోలీసులు అతడి నుంచి 6.3లీటర్ల మద్యం బాటిళ్లతో పాటు ద్విచక్ర వాహనం స్వాధీనం చేసుకొని సీజ్ చేశారు. కేసు నమోదు చేశారు. ఎక్సైజ్ కార్యాలయానికి తరలించారు. ఈ సందర్భంగా ఎక్సైజ్ సీఐ ఎండీ అక్బర్ హుస్సేన్ మాట్లాడుతూ, ఎన్నికల నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. అక్రమంగా మద్యం తరలించినా, అమ్మినా కేసులు నమోదు చేస్తామని చెప్పారు. ఇక్కడ ఎస్ఐలు రమాదేవి, కబీర్‌దాస్, హెడ్ కానిస్టేబుల్ ఐలయ్య, కానిస్టేబుల్స్ విశ్వజ్ఞ, పెద్దన్న, శైలజ, పద్మావతి ఉన్నారు.

# నేడు మండలంలో బీఆర్ఎస్ ప్రచారం

వీణవంక, నవంబర్ 1: మండలంలోని వివిధ గ్రామాల్లో గురువారం బీఆర్ఎస్ హుజూరాబాద్ ఎమ్మెల్యే అభ్యర్థి పాడి కౌశిక్‌రెడ్డి ఎన్నికల ప్రచారం నిర్వహించనున్నట్లు ఎంపీపీ ముసిపట్ల రేణుక-తిరుపతిరెడ్డి, జడ్పీటీసీ మాడ వనమాల-సాధవరెడ్డి తెలిపారు. మండలంలోని కనపర్తి, బేతిగల్, వల్భాపూర్, నర్సింగాపూర్ గ్రామాల్లో ఉదయం ప్రచారం చేస్తారని చెప్పారు. మండల ప్రజాప్రతినిధులు, సర్పంచులు, ఎంపీటీసీలు, సింగిల్‌విండో డైరెక్టర్లు, బీఆర్ఎస్ నాయకులు, అనుబంధ సంఘాల నాయకులు, కార్యకర్తలు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.